ఎమ్మెల్యేను సన్మానించిన పాస్టర్లు

ప్రజాశక్తి-మదనపల్లె

గత ప్రభుత్వంలో పాస్టర్లకు ఇవ్వాల్సిన బకాయి జీతాలు ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలలోనే క్రైస్తవ చర్చి పాస్టర్లు ఒక్కొక్క పాస్టర్‌కు రూ.35 వేలు విడుదల చేసిన తెలుగుదేశం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియ జేసుకుంటూ మదనపల్లి ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషాను కలిసి మర్యాద పూర్వకంగా సన్మానించారు. అనంతరం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి పట్టణ, నియోజకవర్గ చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న పాస్టర్లు

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్య లను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగు తోందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభు త్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యా దులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకుని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సాధించాలని వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జెసి స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌక ర్యాలను కల్పించారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూ దనరావు, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దళిత గ్రామాల చుట్టూ ఎత్తైన అడ్డుగోడలు

రాజంపేట అర్బన్ : కూచివారిపల్లె గ్రామ పంచాయతీలోని డి.బి.ఎస్ పల్లె అరుంధతివాడ, ఊటుకూరు పంచాయతీలోని డి.బి.ఎస్.పల్లె దళితవాడలలో తమ గ్రామాల చుట్టూ పెత్తందార్లు ఎత్తైన గోడలు నిర్మించి తమను సామా జికంగా వెలివేతకు గురిచేస్తున్నారని ఆ రెండు గ్రామాల దళిత ప్రజలు ఎమ్మా ర్పీఎస్ నాయకులతో కలిసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ నైదియాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వెలగచర్ల శివయ్య మాట్లాడుతూ పెత్తందారు అణచివేతకు దళితులు గురవుతూనే ఉన్నారని ఆవేదన చెందారు. గ్రామస్తులు మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన చౌదరి సామాజిక వర్గానికి చెందినవారు తమకు దారి కూడా లేకుండా రోడ్డును సైతం ఆక్రమించి తమ గ్రామం చుట్టూ ఎత్తైన అడ్డు గోడలు నిర్మిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చేమూరి వెంకటేష్, వడ్డెర సంఘం నాయకులు చిట్టెమ్మ పెంచలయ్య, గ్రామ స్తులు కత్తి సుభాషిని, రమణ, వెంకటసుబ్బయ్య, రవి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : ఎమ్మెల్యే

మదనపల్లె : తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ఆయన అర్జీ దారుల నుండి వినతులను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం జరిగిందని, ఎక్కువగా వీధిలైట్లు తాగునీటి సమస్య మీద వినతులు వస్తున్నాయని వాటిపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయాలని మున్సిపల్ అధికారులను సూచించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డిఇ, ఆర్ఐ, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హోటళ్లలో నాణ్యత లోపించడంపై ఫిర్యాదు

మదనపల్లె అర్బన్ : పట్టణంలో చికెన్, మటన్ దుకాణాలతోపాటు హోటల్స్, రెస్టారెంట్లలో నాణ్యత లోపించిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నారని, దీనివల్ల వినియోగదారులు, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు ఆందో ళన వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ సెల్‌లో సబ్ కలెక్టరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లోపించిన మాంసాహార పదా ర్థాలను వినియోగదారులకు సరఫరా చేస్తున్నా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజలు, వినియోగదారుల ఆహార భద్రతను పర్య వేక్షించాల్సిన అధికారులు మామూళ్ళ మత్తులో తనిఖీలకు దూరంగా ఉండడాన్ని ఆక్షేపించారు. దీనిపై సబ్ కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తిపై సబ్ కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం స్టేట్ యూత్ ప్రెసిడెంట్ టేకుపల్లి శ్రీనివాసులు, నాయకులు మోహన్, రెడ్డి ఈశ్వర, గణేష్, రెడ్డెప్ప, శ్రీరాములు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్ర

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

ప్రజాశక్తి - కడప అర్బన్

వక్ఫ్ బిల్లు చట్టం కాకముందే కేంద్రం కార్పొరేట్లకు 99 ఏళ్లకు లీజు ప్రతిపాదనలు తయారు చేసిందని, అల్ప సంఖ్యాక వర్గాల రక్షణ, రాజ్యాంగ హక్కులు కాలరస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన 'వక్ఫ్ బోర్డు సవరణ చట్టం –రాజ్యాంగ బద్ధత సవాళ్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ 2014 నుంచి కేంద్రంలో కొలువై ఉన్న బిజెపి ప్రభుత్వం, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాల ముఖ్య మంత్రులు వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు చట్టం కాకముందే, ఇన్ని వేల ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని బెదిరింపులకు దిగారన్నారు. ధార్మిక బోర్డులలో పరమతస్తులను నియమించే నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. జస్టిస్ సచార్ కమిటీ ముస్లిం ధార్మిక సంస్థల ఆస్తుల రక్షణకు అనేక ప్రతిపాదనలు చేశారని ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. 1000 ఏళ్ల క్రితం దేశాన్ని పాలించిన నవాబులు దాతత్వం తో ఇచ్చిన ఆస్తుల దస్తావేజులు లేవని బై యూజర్ పేరిట ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటాను అనడం బిల్లు చట్టరూపం కాకముందే 52 కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు 99 సంవత్సరాలకు లీజులు ప్రధాన నగరాల్లోని విలువైన స్థలాలను, భవంతులను ఇవ్వటానికి ప్రతిపాదనలు ముందుగానే తయారు చేసుకోవడం అప్రజాస్వామిక చర్య అన్నారు. బాబ్రీ మసీదు మొదలుకుని చార్మినార్ వరకు దేశంలో మైనార్టీలపై హిందుత్వ ఫాసిస్టు భావాజాలంతో దాడులు జరుగుతున్నాయని, దేశంలోని మానవతావాదులు, లౌకికవాదులు, గణతంత్ర భావాలు కలిగిన వారు, ప్రజాస్వామ్యవాదులు, సామ్యవాదులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ముస్లిం యేతర సమాజాలు ముస్లింలకు అండగా, సంఘీభావంగా నిలబడాల్సిన అవసరం నేడు దేశంలో ఏర్పడిందన్నారు. గతంలో ధార్మిక సంస్థల్లో మహిళలు బోర్డు మెంబర్లుగా ఉండేవారని, బిజెపి మనువాద ప్రభుత్వం మహిళల ప్రాతినిధ్యాన్ని తిరస్కరిస్తూ చట్టాలు చేస్తోందని విమర్శించారు. ఇది భారత రాజ్యాంగం ఆర్టికల్ 14కు పూర్తిగా వ్యతిరేకమన్నారు. ప్రశ్నించే వారందరినీ అర్బన్ నక్సలైట్ల పేరుతో దేశద్రోహ కేసులు పెట్టి హింసిస్తున్నారని, చివరికి దేశ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ చీఫ్ రాహుల్ గాంధీని, సుప్రీం కోర్టు న్యాయమూర్తులను కూడా ఈ కోవలోకి చేరుస్తున్నారని ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలో నియంతత్వం వస్తుందని ప్రజాస్వామ్యం కనుమరుగవుతుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కన్వీనర్ డబ్ల్యూ రాము, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా అధ్యక్షులు ఓబయ్య, దళిత మిత్ర సంఘం నాయకులు రామాంజనేయులు ఆవాస్ జిల్లా అధ్యక్షులు పఠాన్ చాంద్ బాషా, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు పగిలి గుర్రప్ప, డాక్టర్ రామచంద్రారెడ్డి, న్యాయవాది రమేష్ బాబు, ముస్లిం జెఎసి జిల్లా కన్వీనర్ బాబు భాయ్, బిసి సంఘం రాష్ట్ర నాయకులు బి.సి. రమణ, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన సమితి నాయకులు బి.గురుమూర్తి, ఓ.సి.సంఘం వ్యవస్థాపకులు శ్రీనివాసుల రెడ్డి, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్.గోపాల్, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్, డాక్టర్ గౌస్ పీర్, లోక్ సత్తా నాయకులు కష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, స్వతంత్ర పాస్టర్ల అసోసియేషన్ నాయకులు విజయభాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.ఎ. సత్తార్, హైకోర్టు న్యాయవాది అలీ ఖాన్, సిపిఎం నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల, మైనార్టీ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్

చిరుత మృతి కేసు నుంచి విముక్తి కల్పించండి

- ప్రభుత్వ విప్ హరిప్రసాద్‌కు రైతుల కుటుంబాలు వినతి

ప్రభుత్వ విప్ హరిప్రసాద్‌ను కలిసిన రైతుల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చిరుత మృతి ఘటనలో తమ వారిపై అన్యాయంగా కేసులు పెట్టారని, కేసుల నుంచి తమ వారికి విముక్తి కల్పించాలని కోరుతూ మదనపల్లి రూరల్ మండలం పొన్నూటిపాలెంకు చెందిన రైతుల కుటుంబ సభ్యులు సోమవారం విజయవాడలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖా మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తమ బాధని తీసుకెళ్లాలని వారు కోరారు. కేవలం చిరుత చనిపోయిన ప్రాంతానికి ఆనుకుని ఉన్న భూమిని ప్రామాణికంగా చేసుకుని అటవీ శాఖ అధికారులు తమ వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. చిరుత మృతిలో తమవారి ప్రేమయం లేకపోయినా, ఏమాత్రం విచారణ జరపకుండా, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా అప్పటికప్పుడు అరెస్టులు చేశారని చెప్పారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమ వారికి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సంఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హరిప్రసాద్ రైతుల కుటుంబాలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతుల కుటుంబ సభ్యులతో మదనపల్లె జనసేన పార్టీ నాయకులు రాందాస్ చౌదరి, మైఫోర్స్ మహేష్ ఉన్నారు.

వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ రాజు, వైద్య సిబ్బంది

డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కిడ్నీ వ్యాధిగ్రస్తులు రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలోని డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ పి.వి.ఎన్.రాజు తెలియజేశారు. ప్రాంతీయ వైద్యశాలలో నెఫ్రాలజీ విభాగానికి సంబంధించిన డయాలసిస్ కేంద్రం ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ప్రాంతీయ వైద్యశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ పివిఎన్ రాజు మాట్లాడుతూ ఇప్పటివరకు 32 మంది రోగులు కేంద్రంలో డయాలసిస్ చేయించుకున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకే తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా డయాలసిస్ కేంద్రం పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలియజేశారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు డయాలసిస్ కేంద్రంలో మరో 10 పడకలు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో రాహికేర్ యూనిట్ వైద్యులు ఎన్.సాయి ప్రతాప్, మేనేజర్ జి.అనిత కుమార్, సీనియర్ డయాలసిస్ టెక్నీషియన్ ఎం.నాగమణిరెడ్డి పాల్గొన్నారు.

వంక కబ్జా చేశారంటూ గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని బార్లపల్లిలో వంకను కబ్జా చేసి ఆక్రమించుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం అధికారుల తీరుకు నిరసనగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందరరేగా గ్రామస్థులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా వ్యవసాయ పొలాలకు అనుసంధానంగా ఉన్న వంకను పూడ్చేసి కబ్జా చేశారని, అందులో ప్రహరీ గోడ కూడా నిర్మించారన్నారు. ఈ విషయమై స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ మెఘా స్వరూప్ కు అర్జీ అందజేసి, సమస్యను విన్నవించారు.

ప్రాణ రక్షణకు హెల్మెట్ చాలా అవసరం

ప్రజాశక్తి-పీలేరు

ద్విచక్ర వాహనదారులు తమ ప్రాణ రక్షణకు హెల్మెట్ విధిగా వినియోగించాలని పీలేరు ఎస్ఐ లోకేష్, బాలకృష్ణ తెలిపారు. సోమవారం వారు పట్టణ శివారులోని మదనపల్లి మార్గంలోని వేపులబైలు సమీపంలో జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే ద్విచక్ర వాహనదారులను ఆపి, హెల్మెట్ అవసరం, ఆవశ్యకతలపై వారికి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని అన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ ఫోన్‌ల మాట్లాడుతూ బండ్లు నడపడం మీకే కాకుండా మీకు ఎదురు వచ్చే వాహనాదారులకు కూడా ప్రమాదమని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రతి వాహనదారుడు రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించే వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐలు

ఇకెవైసి లేకుంటే రేషన్ కార్డులు రద్దు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని రేషన్ కార్డు దారులు ఈ నెలాఖరులోగా సమీప సచివాలయాల్లో ఇకెవైసి చేసుకోవాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో ఎండియు వాహనాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సంధ్బంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు దారులు ఇకెవైసి చేసుకోవడానికి ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా ఇకెవైసి పెండింగ్ ఉంటే సంబంధిత సచివాలయాల్లో వెంటనే పూర్తి చేసుకోవాలని తెలిపారు. లేకపోతే ఇకెవైసి చేసుకోని వారికి రేషన్ కార్డులు రద్దు అవుతాయని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

గ్రామాలలోని ప్రజల సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అన్నమయ్య జిల్లాలోని అన్ని మండలాల ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ సెక్రటరీలతో గ్రామాలు, మండలాలలో జరుగుతున్న చెత్త సేకరణ, పన్నుల నిర్వహణ, నీటి సరఫరా, గ్రీన్ అంబా సిడర్లు, తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలకుకు కేటాయించిన మొత్తం 29 రకాల విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పంచా యతీలలో తాగునీటి సమస్య ఉండరాదని, ఏ ప్రాంతాలలో తాగునీటి సమస్య వస్తుందో ముందుగానే అంచనా వేసుకొని తగు చర్యలు తీసుకు నేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ సిబ్బం దితో సమన్వయం చేసుకొని ఆరేడబ్ల్యూఎస్ 1 యాప్ ద్వారా తాగునీటి వినియోగాన్ని ఎప్పటికప్పుడు రిపోర్టు చేయాలన్నారు. గ్రామాలలోని ట్యాంకులను శుభ్రపరచడం పట్ల దృష్టి సారించాలని అవసరానికి తగ్గిన ట్లుగా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. గత శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ వ్యర్థాలపై అవగాహనను దృష్టిలో పెట్టుకొని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించాలని ఆదేశించారు. జాతీయ రహదా రుల పక్కన చెత్త కనపడకూడదని జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో పరిశీలించి ఎక్కడైనా చెత్త ఉంటే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ సెక్రటరీలతో డివిజన్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించుకొని నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని డిపిఒను ఆదేశించారు. ఐవిఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి సేకరించి అభిప్రాయాల పట్ల ప్రభుత్వం ద ృష్టి సారించిందని ప్రజలు మంచి అభిప్రాయాలు ఇస్తేనే సిబ్బంది బాగా పనిచేసినట్లు అని పేర్కొన్నారు. ఫైనాన్స్ కమిషన్ వారిచే నిధులపై ఆధారపడకుండా పన్నుల సేకరణ పై దృష్టి సారించాలని సూచించారు. నిధుల సేకరణ పై పంచాయతీ సెక్రటరీలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కార్మికులకు కోళ్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఇఒ, మనోరెడ్డి

పంచాయతీ కార్మికులకు కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణానికి చెందిన మనోరెడ్డి గ్రామ పంచాయతీ కార్మికులకు కోళ్లు పంచిపెట్టారు. స్థానిక చిత్తూరు రోడ్డులో నివాసం ఉంటున్న మనోరెడ్డి దివంగతులైన తన తల్లిదండ్రులు విశ్రాంత ప్రధానో పాధ్యాయులు నారాయణ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయిని హెలెన్ కుమారీల పేరున ప్రతి ఏటా ఈస్టర్ డే సందరరేగా పేదలకు బియ్యం, కోడి గుడ్లు, కూరగాయలు వంటివి పంపిణీ చేసేవారు. ఈ సంవత్సరం కార్యక్ర మంలో భాగంగా సోమవారం ఆయన గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో పంచాయితీ పరిధిలో పనిచేసే కార్మికులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే కార్మికులకు సుమారు 170 మందికి బాయిలర్ కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ బతికున్న రోజుల్లోనే తల్లిదండ్రులను సరిగ్గా పట్టించుకోని సంతానం ఉన్న ఈ రోజుల్లో, సుమారు 15 ఏళ్ల క్రితం మృతి చెందిన తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఈస్టర్ డే పురస్కరించుకుని పేదలకు తన వంతు సహాయాన్ని అందించే మనో రెడ్డి లాంటి కుమారులు ఉండడం ఆ తల్లిదండ్రి చేసుకున్న పుణ్యఫలమన్నారు. కార్యక్రమంలో దినకర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఇఒ గురు మోహన్, వార్డు సభ్యులు శ్రీనాథ్‌రెడ్డి, ఆబిద్, మల్లికార్జునరెడ్డి, నాగభూషణం, విక్టరీ వెంకట రమణారెడ్డి, నాగరాజ నాయక్, సాంబశివారెడ్డి, కాలేషా కాలేష, పరమేష్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నారే వెంకట్రమణారెడ్డి, గ్రామ పంచా యతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకటరామయ్య, పంచాయతీ అధ్యక్షులు బివి రమణ, ఉపాధ్యక్షులు పులి రెడ్డప్ప, చిట్టెమ్మ, ఎల్లయ్య, కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి నాగార్జున పాల్గొన్నారు.

పీలేరు రీసర్వే డిటిగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుగా ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీలేరు మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం నమాజ్ జిల్లా కలెక్టరేట్ కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కలెక్టరేట్లోనే పని చేస్తున్న ప్రసాద్ ను పీలేరు రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు గా బదిలీపై వచ్చారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయన సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తాను మండల పరిధిలోని రెవెన్యూ సమస్యలపై అవగాహన కలిగి పని చేస్తానని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులను సన్మానించిన సర్పంచ్, ఇఒ

కార్మికులతో కలిసి పనిచేసేవాడే నిజమైన నాయకుడు

ప్రజాశక్తి-పీలేరు

కార్మికులతో కలిసి పనిచేసే వాడే నిజమైన నాయకుడని పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషా, గ్రేడ్ వన్ ఇఒ గురు మోహన్ అన్నారు. పీలేరు గ్రామ పంచాయతీలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులను, సభ్యులను సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఇఒ, వార్డు సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నాయకత్వ బాధ్యతలు తీసుకుంటే సరిపోదని, కార్మికులు ఎదురుకునే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం వారు కొత్తగా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులను, సభ్యులు ధనాసి వెంకట్రామయ్య, బీవీ రమణ, రెడ్డప్ప, చిట్టెమ్మ, ఎల్లయ్య, ఓబులేసు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, శ్యామల, నాగార్జున, మస్తాన్ సాహెబ్, గురు ప్రసాద్, రమేష్, ధనభాగ్యం, సరోజ, గోపాల్, సరోజమ్మ, శ్రీరాములు, అశోక్, ముబారక్, ఆనంద, వైయస్సార్ మస్తాన్, నాగమ్మ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాయచోటి



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ట్రైనర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. సోమ వారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో వారు సైబర్ సురక్ష అంశంపై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ ఫౌండేషన్, తిరుపతి సంస్థ నుండి ట్రైనర్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సాంకేతికత వల్ల ప్రపంచం మన అరచేతిలోకి వచ్చేసిందిన్నారు. సాంకేతికతను ఉపయోగించి సైబర్ నేరగాళ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి, అని సూచిం చారు. ఫిషింగ్ మెయిళ్లు, ఫేక్ లింకులు, సామాజిక మాధ్యమాల మోసాల గురించి వివరించి బలమైన పాస్‌వర్డు వాడటంతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని సంరక్షిం చుకోవాలని తెలిపారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, డ్రగ్స్, మనీ లాండరింగ్ పేరుతో మోసాలు జరుగు తున్నాయని అనుమానాస్పద లింకులు, సందేశాలు వచ్చినపుడు వెంటనే సైబర్ క్రైమ్ సెల్‌ను సంప్రదించాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. ప్రజల్లో చైత న్యం పెరిగితేనే సైబర్ నేరాల తగ్గుదల సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ప్రవీణ్ కుమార్ సన్మానించే జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో సైబర్ నిపుణులు మహేశ్వర బాబు, హేమ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ వెంకటేశ్వర నాయక్

ఉచిత విద్యా చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ప్రయివేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు అందించే ఉచిత విద్యపై సిఆర్‌పి, ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు అవగాహన కలిగించినట్లు ఎంఇఒ రవీంద్రనాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం పేద విద్యార్థుల కోసం 25 శాతం పాఠశాలలో సీట్లు కేటాయించాలని జిఒ ప్రకారం తప్పనిసరిగా పిల్లల్లో చేర్చుకోవాలని తెలిపారు. ఎస్‌సిలకు 10శాతం, విభిన్న ప్రతిభావంతులకు 5శాతం, ఎస్‌టిలకు 4శాతం, బిసి, మైనార్టీలకు 6శాతం కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు ఏ పాఠశాలలో చదవాలని అనుకుంటున్నారో అలాంటి పాఠశాలలోనే చేర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 వెంకటేశ్వర్లునాయక్, సిఆర్‌పి గంగయ్య, పాఠశాల కరస్పాండెంట్లు పాల్గొన్నారు

కువైట్‌లో చంద్రబాబు జన్మదిన వేడుకల్లో రెడ్డిశేఖర్, కార్యకర్తలు

కువైట్‌లో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ముడుంపాడు గ్రామపంచాయతీ కందులవారిపల్లె చెందిన కంచన రెడ్డిశేఖర్ కువైట్‌లో సోమవారం సిఎం చంద్రబాబు 75వ జన్మదిన వేడులను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. టిడిపి కార్యాలయంలో తెలుగు వారందరూ కలిసి చంద్రబాబు జన్మదిన వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు ప్రజలు అభివృద్ధి చెందే విధంగా ఆయన పాలన సాగిస్తున్నారని అన్నారు. విదేశాలలో తాము కూడా ఆనందంగా ఉన్నామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు డిఎస్‌సి టీచర్ పోస్టులను నోటిఫికేషన్ విడుదల చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు సహదేవ పాల్గొన్నారు.

రూ.20 ప్రీమియంతో రూ.రెండు లక్షల బీమా

ప్రజాశక్తి-రామాపురం

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.20 ప్రీమియంతో తపాలా కార్యాల యం, బ్యాంకుల్లో రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని ఎపిఒ పెంచలయ్య తెలిపారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఏడాదికి రూ.20 రూపా యలు చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణించినా, విభిన్న ప్రతిభావంతులైనా రెండు లక్షలు ప్రమాదం బీమా వర్తిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోని ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయి సిబ్బంది కూలీలకు బీమా గురించి తెలియజేయాలని అన్నారు.

వైసిపి యువ నాయకుడు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని పోతబోలు పంచాయతీ దిగువగాండ్లపల్లి దళితవాడకు చెందిన వైసిపి యువనాయకుడు చంద్రశేఖర్ సోమవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ చంద్రశేఖర్ మృత దేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరా మర్శిం చారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. కేవలం 29 ఏళ్ల వయస్సులోనే చంద్ర శేఖర్ మృతి భాదించిందని, చురుకైన యువ నాయకుడిని పార్టీ కోల్పో యిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిస్సార్‌తో పాటు పోతబోలు సర్పంచ్ ఈశ్వరయ్య, లక్ష్మీపతి, సుధాకర్, మోహన్, మల్లికార్జునరెడ్డి, గ్రానైట్ మహేష్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎఇఒ

ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-కలకడ : మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో సోమవారం ఆరవ తరగతి ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపల్ మలంషావలి తెలిపారు. ఈ పరీక్షకు 77 మంది దరఖాస్తు చేసుకోగా 76 మంది విద్యా ర్థులు హాజరైనట్లు తెలిపారు. ఎంఇఒ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పరీక్షను ప్రశాం తంగా జరిపినట్లు తెలిపారు. త్వరలో పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత ర్యాం కులు ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

మార్కెట్ యార్డ్ సెక్రటరీగా నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మార్కెట్ యార్డ్ సెక్రటరీగా నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి సెక్రటరీగా జగదీష్ పని చేశారు. ఆయన స్థానంలో మదనపల్లి సెక్రెటరీ పని చేస్తున్న నవీన్ కుమార్ రెడ్డి బదిలీపై మొలకచెరువుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ లో రైతులకు అన్ని సదుపాయాలు కల్పించి, రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

మహారాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో రాజంపేట

M.V.O.P. No : 18/2024

సి.సంజమ్మ W/o సుబ్బారాయుడు, పుత్తనవారి పల్లి (గ్రా), పుల్లంపేట (మం), అన్నమయ్య జిల్లా.

...పిటీషనర్

V/s

కమసాని ముని గంగిరెడ్డి, S/o క్రిష్ణా రెడ్డి, STY లైన్, దొడ్డమంగల మెయిన్ రోడ్డు, మైక్ గేట్ దగ్గర, బెంగళూరు, దక్షిణం కర్ణాటక రాష్ట్రం.

...రెస్పాండెంట్-3

నోటీసు

పై కోర్టు నందు పై పిటీషనర్ మీపై నష్టపరిహారం కోసం కేసు వేసినారు. మీరు విచారణ నిమిత్తం 02.05.2025 వ తేదీన పై కోర్టు నందు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కావలెను. లేనంతట పరోక్షమునందు తీర్మానించెదరు.

//By Order of the Court//

నలికిరి రెడ్డెయ్య

న్యాయవాది

రాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి (సీనియర్ డివిజన్): రాజంపేట

ఇ.పి.నెం. 42/2019

ఓ.యస్ నెం. 68/2017

బూజిరెడ్డి క్రిష్ణవేణి భర్త రాజశేఖర్ రెడ్డి, 45 సం॥లు, వ్యవసాయం, గట్టుమీదపల్లె గ్రామం, వెలగచెర్ల పోస్టు మరియు మజరా, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా.

...పిటిషనరు/డి. హెచ్. ఆర్

Vs

పోలి చిన్న సుబ్బారెడ్డి, పోలి వాల్సు, పోలి సూర్య నారాయణ రెడ్డి, 55 సం॥లు, వ్యవసాయం, మందరం కొత్తపల్లి, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్/జె.డి.ఆర్

పై కోర్టులో పైన కనపరచిన ఇ.పిలో క్రింద కనబరచిన స్థిరాస్థిని 05.05.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో వేలం వేయుదురు, వేలందార్లు పై తేదిన పై సమయంలో పై కోర్టులో హాజరై వేలంలో పాల్గొనవచ్చును. వేలంపై ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల తెలుపగోరడమైనది.

గమనిక: వేలంలో పాల్గొన్న వేలం దార్లలో ఎక్కువ వేలం పాట ఎవరు పాడతారో సదరు వేలం దారుడు వేలం పైకంలో 1/4 వంతు పై తేదిన పై కోర్టులో డిపాజిట్ చేయవలెను.

షెడ్యూలు

అన్నమయ్య డిస్ట్రిక్ట్, చిట్వేలి సబ్-డిస్ట్రిక్ట్, పెనగలూరు మండలం, ఈటెమార్పురం గ్రామంలోని పొలంలకు నెంబరు వారి వివరం.

1. సర్కారు ఖుష్కి సర్వే నెంబరు 111/10 య. 0.60 సెంట్లు, 0.672 హెక్టార్లు. 2. సర్కారు ఖుష్కి సర్వే నెంబరు 113/1 య 0.16 సెంట్లు, 0.64 హెక్టార్లు.
3. సర్కారు ఖుష్కి సర్వే నెంబరు 113/3 య 0.26 సెంట్లు, 1.05 హెక్టార్లు. చెక్కుబంది:
వేమిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి మరియు చిన్న పోలి
తూర్పు: బూజిరెడ్డి కన్నారెడ్డి భూమి, పడమర: నారాయణ రెడ్డి, ఉత్తరం వంక, దక్షిణం వెలగచెర్ల జయరామి రెడ్డి మరియు వెంకట సుబ్బారెడ్డి భూములు.
డి.హెచ్.ఆర్ విలువ రూ. 2,00,000/-

//బై ఆర్డరు ఆఫ్ ది కోర్టు//

ఓ.వి క్రిష్ణారెడ్డి, ఎమ్.ఏ, ఎల్.ఎల్.బి,

పిటిషనరు పరం న్యాయవాది, నందలూరు.

ఆగిన తాగునీటి పథకం నిర్మాణ పనులు

- ఏడేళ్లుగా నిరీక్షిస్తున్న ప్రజలు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాళ్ళమడుగు నుంచి 14 గ్రామ పంచాయతీలకు అందించేందుకు వైసిపి ప్రభుత్వంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్‌రెడ్డి నిధులు మంజూరు చేయించి కొంత వరకు పనులు చేయించారు. ఆ తర్వాత మధ్యలోనే పనులను నిలిపి వేశారు. ఇప్పటికి ఏడేళ్లు కావస్తున్నా ఇంత వరకు నీటి పథకం నిర్మాణం పూర్తి చేయకపోవడంతో మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోళ్లమడుగు నుంచి నీటిని సుండుపల్లెకు తేవాలని కోట్లాది రూపాయలను ఖర్చు చేసి పైపులు కూడా కొన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేశారని, ఆ పనులు మధ్యలోనే ఆగిపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బోర్లు కూడా ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వాలు మారినా మా గోడు పట్టించుకునే వారే లేరని

నిలిచిపోయిన వాటర్ పథకం నిర్మాణం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రారంభించిన పనులు మధ్యలోనే ఆపివేయడం ప్రజాధనం వృథా కావడమేనని అన్నారు. కూటమి ప్రభుత్వమైన స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నీటి ట్యాంకర్ నిర్మాణాన్ని పూర్తి చేసి మండల ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

బి.కొత్తకోట : విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు ఇస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కలకడ

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోన క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు మోడమ్. చెంగల్ రాయుడు పేర్కొన్నారు. విద్యార్థుల ఎన్‌రో ల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఉపా ధ్యాయులతో కలిసి వెంగన్నగారిపల్లి, గుడిబండ, బంగారు పాండ్ల పల్లిలో తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠ శాలలోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు విద్యా ర్థులకు ఉచితంగా పుస్తకాలు, వస్త్రాలు ఇస్తారని తెలిపారు. ఉన్నత విద్యార్హతలు కలిగి మంచి అను భవం కలిగిన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందిస్తారని అన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్విని యోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యా ర్థులను చేర్పించాలని కోరారు. కార్యక్ర మంలో గఫార్ ఖాన్, ఝాన్సీ రాణి, నౌషాద్ బేగం పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జడ్‌ఎ హైస్కూల్ హెచ్‌ఎం, పాఠశాల కమిటీ చైర్మన్ పి.నాగేశ్వర్, ఉపాధ్యాయులు నూతన అడ్మిషన్ల కొరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హైస్కూల్ చుట్టుపక్కల గ్రామాల్లో తిరు గుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యా యులు ఉంటారని, విద్యా ర్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవి ష్యత్తుకు గట్టి పునాది ప్రభుత్వ పాఠ శాలల్లోనే పడు తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న ఉచిత భోజనం, యూనిఫామ్, పుస్త కాలు రాగి జావా, చిక్కి ఉచితంగా విద్యార్థులకు అందిస్తోందని తెలిపారు. సువిశాలమైన ఆటస్థలం ప్రభుత్వ పాఠశాలల్లోని ఉంటుందని తెలిపారు. పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన వారికి ట్రిపుల్ ఐటిలో సీట్లు సులభంగా వస్తాయన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల ను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పల కాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.బబిత, పాఠశాల కమిటీ చైర్మన్ పటం నాగేశ్వర్, ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, ఆసిఫ్‌బాషా, శామీర్ హుస్సేన్, గిరిధర్ ప్రమీల, ప్రమీల కుమారి పాల్గొన్నారు.

కలకడ : ప్రభుత్వ పాఠశాలల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు

- రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తుకు అవకాశం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోందని ఉపాధి హామీ పథకం ఎపిఒ మృత్యుంజయరావు పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నాగార్జున ఆధ్వర్యంలో ఉద్యానశాఖ, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి కొత్తగా పండ్ల తోటల పెంపకం కోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గురించి రైతు సేవ కేంద్రం సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం ఏర్పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు రైతు సేవ కేంద్రం పరిధిలో కొత్తగా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, బత్తాయి, నేరేడు, ఉసిరి, డ్రాగన్ ఫ్రూట్, అంజూర, చింత, పనస, అవకాడో, వంటి పండ్ల తోటల పెంపకానికి రాయితీ కోసం అర్హులైన రైతులను గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. పండ్ల పెంపకంతో పాటు, పూలు, గడ్డి పెంపకానికి రాయితీ ఉంటుందని అర్హులైన రైతులు రైతు సేవ కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. రైల్వే కోడూరు ఉద్యానాధికారి ఎం.భాస్కర్ మాట్లాడుతూ జాబ్ కార్డు లేని భూమి ,నీటి వసతి కలిగిన రైతులు నూతనంగా పండ్ల తోటల పెంపకానికి ఉద్యాన శాఖ ద్వారా

మాట్లాడుతున్న ఎపిఒ మృత్యుంజయరావు

మొదటి మూడు సంవత్సరాలకు 40శాతం రాయితీ అందుతుందని, అన్నారు. ఆయిల్ పామ్ పెంపకానికి ప్రభుత్వం నుంచి మొదటి నాలుగు సంవత్సరాలలో సాగు రాయుతికి హెక్టార్ కి రూ. 21వేలు, అంతర పంటల సాగుకు ప్రతి సంవత్సరం హెక్టార్‌కు రూ.5250 రాయితీ అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

పట్టణ శుభ్రతకు ప్రజలు సహకరించాలి

- ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధం
- నగర పంచాయతీ కమిషనర్ పల్లవి

దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేస్తున్న కమిషనర్ పల్లవి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణ పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ జివి.పల్లవి పల్లవి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు దుకాణాల్లో కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, సింగల్ యూస్ టీ కప్పులు, ప్లాస్టిక్ కప్పులు పూర్తిగా నిషేధించినట్లు ప్రజలు, దుకాణ దారులకు అవగాహన కల్పించారు. గృహాలు, హోటళ్ల నుంచి వచ్చు వ్యర్థ పదార్థ ములను రోడ్లపైన, కాలువలో వేయకూడదని తెలిపారు. రోడ్లపై చెత్తా చెదారం వంటి వ్యర్థాలు వేస్తే దుకాణ దారులపై చర్యలు తప్పవని, జరిమానా విధిస్తామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్ప వన్నారు. ప్రజలందరూ తమ గృహాల్లోని వ్యర్థ పదార్థాలను పరిసర ప్రాంతం లోని చెత్త కుండీలలో వేయాలని సూచించారు. ఎవ్వరూ ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ప్రతి ఒక్కరూ గృహాలతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛ బి.కొత్తకోటకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి :సిఐ

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని సిఐ రెడ్డి శేఖర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం సిద్దార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఘనంగా కాన్వోకేషన్‌డే కరెస్పాండెంట్ సుధానందరెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రమ శిక్షణ, మానవతా విలువలు కూడా ఎంతో అవసరమని, అప్పుడే సమాజంలో గౌరవం, పేరు ప్రఖ్యాతలు దక్కుతాయని తెలిపారు. కర స్పాండెంట్ సుధానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో కష్టపడి చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ విద్యార్థులను ప్రాథమిక పాఠశాలకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉన్నత పాఠశాలకు ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, వై .జనార్దన్ రెడ్డి, శ్రీనివాస జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాఠశాల కరెస్పాండెంట్ సుధానందరెడ్డి

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్‌సి వర్గీకరణ ఆర్డినెన్స్‌పై ఎంఆర్‌పిఎస్ సంబరాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

ఎస్‌సి వర్గీకరణకు కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై సోమవారం తంబళ్లపల్లెలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక హరిత కూడలి వద్ద ఎస్‌సి వర్గీకరణ అమలుకు కృషి చేసిన పిఎం నరేంద్రమోదీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి కేకు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జాతీయ నాయకుడు నరేంద్ర మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణతో మాదిగల ఆకాంక్ష నెరవేరిందని అన్నారు. ఎస్‌సి వర్గీకరణతో అనాదిగా వెనుకబడిపోయిన మాదిగల జీవితాల్లో ఇకపై కొత్త వెలుగులు ప్రసరిస్తాయని ధైర్యం వ్యక్తం చేశారు. ఎస్‌సి వర్గీకరణ కోసం 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన ఘనత మందకృష్ణ మాదిగచే దక్కుతుందన్నారు.కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి వేటా మల్లికార్జున, వెంకటప్ప,మల్లి, వెంకట్రమణ, బొజ్జప్ప, రామాంజులు, చిన్నకృష్ణ, టిడిపి మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, తులసీదర్‌నాయుడు, కృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

వేయింగ్ స్కేల్స్‌ను చూపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

వేయింగ్ స్కేల్స్ వితరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్విరామంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు. సోమవారం పెద్దతిప్పసముద్రం మండలం, కందుకూరు సెక్టారులోని 48 అంగన్వాడీ కేంద్రాలకు ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ మిండిగళ్ళు లక్ష్మణ్, సభ్యులు కళ్లకింద రామాంజులు దాతల సహకారంతో డిజిటల్ వెయింగ్ స్కేల్స్ అందించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వెయింగ్ స్కేల్స్ అందజేసిన దాతలకు, సహకరించిన యంగ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులకు అంగన్వాడీ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సోషల్ మీడియా సభ్యులు రెడ్డిబాషా, సూరి, చరణ్, అనిల్, వేణు, జి.రవి, సూపర్వైజర్స్ విజయవాణి, భవాని,సర్పంచ్ శంకర, స్కూల్‌కమిటీ చైర్మన్ నరసింహులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి నేలరాలిన మామిడి కాయలు

ప్రజాశక్తి -గాలివీడు

అకాల వర్షాలు, గాలులు ఈదురు గాలుల వల్ల మామిడి కాయలు నేలపాలై పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అరకొరగా మామిడి కాయలు కాశాయని, ఆ కాయలు కూడా అకాల వర్షాలు గాలి తుఫానులకు నేల రాలిపోతున్నాయని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 86 ఎకరాలలో మామిడి తోట సాగులో ఉంది. మామిడికాయలు రుతువు కొచ్చిన సందర్భంలో నేల రాలిడిపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు.

రాలిపోయిన మామిడి కాయలు చూపుతున్న రైతు

జనంతో కిటకిటలాడిన మల్లయ్య కొండ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. మల్లయ్య కొండకు దిగు వనన్న వెలుగు మల్లమ్మ అమ్మవారిని పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. సందర్శనకు వచ్చిన ప్రజలకు ఆలయ ఇఒ మునిరాజు అన్ని సౌకర్యాలు కల్పించారు.

దేవుని మాన్యం భూములకు వేలం

ప్రజాశక్తి -చిట్వేలి

మండలకేంద్రమైన చిట్వేలిలో వెలసిన యున్న సోమేశ్వర, వీరభద్రాల యం, వరదరాజులు, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబం ధించిన మాన్యం భూములను ఆరు సంవత్సరాల కాల పరిమితితో వేలంపాట నిర్వహి స్తామని రాజంపేట గ్రూప్ దేవాలయాల ఇఒ కొండారెడ్డి పేర్కొన్నారు. సోమవారం గ్రామంలోని శ్రీ శ్యామ లాంబ సమేత శ్రీసోమేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వరధరాజస్వామి, శ్రీభద్ర కాళి వీరభద్రుడు స్వామి ఆలయాలను సంద ర్శించారు. వరదరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న శాండ్ ప్లాస్టింగ్ పను లను పరిశీలించారు. గతంలో వేసిన వేలం పాటను రద్దుచేశామన్నారు. పది రోజుల తరువాత దండోరా వేయించి కొత్త వేలంపాటను నిర్వహిస్తామని ఇఒ తెలిపారు. కార్యక్రమంలో అరవింద్, సురేంద్ర, పవన్‌శర్మ, సునీల్ పాల్గొన్నారు.

ఆలయ సందర్శనలో ఇఒ కొండారెడ్డి

క్రైం కార్నర్

గొర్రెల కాపరి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ పోషణకు జీవనాధారమైన గొర్రెలు జబ్బు పడడంతో గొర్రెల కాపరి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో జరిగింది. పోలీ సుల కథనం మేరకు.. ముద్దలదొడ్డి గ్రామం, ఆవులవారిపల్లికి చెందిన రైతు రామ చంద్ర పొరుగు గ్రామానికి చెందిన ఓ రైతు దగ్గర 30 గొర్రెలును ఏడాది క్రితం కౌలు కు తెచ్చుకున్నాడు. వాటిని మేపుకుంటూ కొన్నిటిని విక్రయించుకుంటూ వచ్చిన ఆదా యంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఆ గొర్రెలు జబ్బు పడ్డాయి. వైద్యం చేయించినా వాటికి జబ్బు నయం కాలేదు. మనస్థాపానికి గురైన రామచంద్ర ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. గమ నించిన కుటుంబీకులు బాధితున్ని వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో మరో వృద్ధుడు..

మదనపల్లె అర్బన్ : కుటుంబ సమస్యలతో వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య కు పాల్ప డిన సంఘటన సోమవారం మదనపల్లెలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివ రాల మేరకు.. స్థానిక కోటవీధికి చెందిన చెన్నయ్య (85)కు ఈ వయసులో కూడా కుటుంబ సమస్యలు చుట్టు ముట్టాయి. జీవితం పై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందిం చడంతో తాలుక సిఐ కళా వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలించారు. వృద్ధుడు మృతికి కుటుంబ సమస్యలే కారణమా లేక మరేవైనా కారణాలు ఉన్నాయా అని విచారిస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సిఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అధిక ధరలకు విక్రయించడానికి అక్రమంగా మద్యం దాచి ఉంచుకున్న వ్యక్తి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. రెడ్డివారిపల్లి పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన తుమ్మల గోపాల్ మదనపల్లెలోని వివిధ మద్యం షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి గ్రామానికి తీసుకువచ్చి అదిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అతనిపై నిఘా ఉంచి ఆదివారం సాయంత్రం రెడ్డివారిపల్లి గ్రామానికి సమీపంలోని పడమర వైపున ముళ్లపొదల వద్ద అక్రమంగా మద్యం విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి పది బ్రాందీ బాటిళ్లు, 8 విస్కీ బాటిళ్లు, 3 బ్రీజర్ ప్లాటినం బాటిళ్లు, 20 కింగ్ ఫిషర్ బీరు బాటిళ్లు మొత్తం రూ.6482లు విలువ కలిగిన 41 మద్యం బాటిళ్లను స్వాధీనం అత నిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. సులువుగా డబ్బు సంపాదించడానికి అక్రమ మద్యం వ్యాపా రానికి పాల్పడినట్లు నిందితుడు తెలిపారన్నారు. ప్రజలు అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడం నేరమని ఎస్‌ఐ తిప్పేస్వామి హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.